ఎవరు దెయ్యం?

ఇ.టి. రామారావు

ప్యూన్ పోస్ట్‌లో వచ్చిన వుత్తరాలు తెచ్చి నా టేబిల్ మీద పెట్టి వెళ్ళాడు.

ఉత్తరాలను చేతిలోకి తీసుకొని ఒక్కొక్కటే చింపి చదువసాగాను. ఎక్కువ భాగం వుత్తరాలు సంతాప సందేశాలే! స్వరూప మరణానికి తమ విచారాన్ని వ్యక్తం చేస్తూ, నాకు తమ సంతాపాన్ని తెలియచేస్తూ దూరపు బంధువులు; స్నేహితులు వ్రాసిన వుత్తరాలే వున్నాయి ఎక్కువగా. గోడకు తగిలించి వున్న క్యాలెండర్ వైపు చూశాను. తారీఖు పది! అంటే స్వరూప మరణించి యీ రోజుకి సరిగ్గా నెలరోజులు!

ఉత్తరాలన్నీ టేబిల్ డ్రాయర్లో వేసి కుర్చీలో వెనక్కి వాలి సిగరెట్ తీసి ముట్టించాను గోడకు తగిలించి వున్న స్వరూప ఫోటో వైపు తదేకంగా చూస్తూ వుండిపోయాను చాలా పెద్ద సైజు ఫోటో అది. ప్రత్యేకంగా ఆర్డరు యిచ్చి తయారు చేయించి ఆఫీసులో నా రూంలో తగిలించాను చనిపోయిన స్వరూపను అనుక్షణం నా కళ్ళ ముందు వుంచుకోవాలన్న తాపత్రయమో, స్వరూపపై నాకు గల ప్రేమాభిమానాలను ఆఫీసులో ప్రదర్శించుకోవాలనే ఆరాటమో తెలీదు కాని ఆ ఫోటో అక్కడ చేరిపోయింది

స్వరూప రూపం ఫోటోలో నుండి నవ్వుతున్నట్లుగా వుంది పెద్ద అందమైన రూపం కాదు స్వరూపది. ఇంకా నిర్మొహమాటంగా చెప్పాలంటే అందవిహీనురాలనే చెప్పాలి! కాని అమోఘమైన తెలివితేటలు! డిగ్రీ ఫస్ట్ క్లాస్‌లో పాసయిన తర్వాత తండ్రి నడిపిస్తున్న వ్యాపారాన్ని తన చేతుల్లోకి తీసుకొంది చిన్నపిల్లల ఆటవస్తువులు తయారు చేసి విక్రయించే వ్యాపారం అది!

స్వరూప యాజమాన్యంలో, అజమాయిషీలో ఆ వ్యాపారం దినదిన ప్రవర్థమానమైంది వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి పెంపొందించింది వ్యాపారాన్ని లక్షల మీద వ్యాపారం నడుస్తూ వుంది మేనేజింగ్ డైరెక్టర్ స్థానానికి ఎదిగిన స్వరూపను చూసి తండ్రి గర్వపడేవాడు

అలాంటి స్వరూప ప్రేమను పొందగలిగాను నేను కాలేజీలో కొద్దిపాటి పరిచయం ఆమెతో! ఉద్యోగాల వేటలో ఒకసారి కాకతాళీయంగా ఆమె ఫ్యాక్టరీకి వచ్చాను ఆప్యాయంగా పలకరించడమే కాకుండా ఉద్యోగం యిచ్చింది కాలం మా యిద్దరి మధ్య అనుబంధాన్ని పటిష్టం చేసింది. స్వరూప నన్ను చాలా గాఢంగా ప్రేమించింది తండ్రిని ఒప్పించి నన్ను పెళ్ళి చేసుకుంది

దురదృష్టం! పెళ్ళయి రెండేళ్ళు నిండక మునుపే ప్రమాదవశాత్తు కారు బ్రేకులు ఫెయిలై యాక్సిడెంటులో మరణించింది!

ఇంటర్‌కమ్ బజర్ మ్రోగిన శబ్దంతో ఆలోచనల నుండి తేరుకున్నాను

"యస్!" అన్నాను రిసీవర్ చేతుల్లోకి తిసుకొని

"మీ కోసం లాయర్ గిరిధర్‌గారు వచ్చారు" చెప్పింది ఆపరేటర్!

"ప్లీజ్ సెండ్ హిమ్ యిన్!" చెప్పాను

మరి కొద్దిసేపట్లో రూం లోపలికి వచ్చాడు లాయర్ గిరిధర్

"కూర్చోండి" అని చెప్పి బజర్ నొక్కాను. ప్యూన్ రాగానే కూల్ డ్రింక్స్ తెమ్మని చెప్పి పంపాను.

గిరిధర్ తన చేతుల్లో వున్న పేపర్లను నా ముందు వుంచాడు.

"మిస్టర్ శ్రీకాంత్! స్వరూప గారి పేరుతో వున్న యీ ఫ్యాక్టరీ, యిందులోని షేర్లు, మిగతా కంపెనీలలో వున్న ఆవిడ షేర్లు అన్నీ చట్ట ప్రకారం మీకు యీ రోజు నుండి సంక్రమించాయి. ఆ విధంగా కోర్టు తీర్మానాలు యివి. ఇక యీ ఫ్యాక్టరీకి మీరు సర్వాధికారి" చెప్పాడు గిరిధర్!

ఆ వార్త నాకేమీ సంతోషం కలిగించలేదు. ఎందుకంటే అవి ఎలాగూ నా స్వంతం అవుతాయని నాకు తెలుసు భార్య పోయాక ఆవిడ పేరుతో వున్న ఆస్తిపాస్తులు భర్తకు గాక మరెవరికి సంక్రమిస్తాయి? పిల్లలు ఎలాగూ లేరు

నా ముఖ కవళికలను గమనిస్తున్న గిరిదర్ అన్నాడు

"భార్య పోయిన విచారం నుండి మీరింకా పూర్తిగా కోలుకున్నట్లు లేదు ఎనీ హౌ ఆవిడ లేని లోటు కన్పించకుండా యీ ఫ్యాక్టరీని అంత పటిష్టంగా నిర్వహించవలసిన బాధ్యత మీది!"

"ప్యూన్ కూల్ డ్రింక్స్ తెచ్చాడు గిరిధర్ కూల్ డ్రింక్ త్రాగుతూ, "మీ శ్రీమతి ఆ రోజు డ్రైవ్ చేస్తున్న కారు బ్రేకులు ఫెయిల్ కావడం మూలాన యాక్సిడెంటుకి గురయి ఆవిడ మరణించిందని నిర్ధారించి ఫైల్ క్లోజ్ చేసారని ఇన్‌స్పెక్టర్ మూర్తి చెప్పాడు" అన్నాడు.

"నేనేమీ మాట్లాడలేదు గిరిధర్ లేచి నిలుచున్నాడు

"ఎనీ హౌ మరొక్కసారి మీకు నా సానుభూతి

దెయ్యాల కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ!

ఆవిడ లేని లోటు మీకు భరింప శక్యం కాదనుకుంటాను'' అని చెప్పి వెళ్ళిపోయాడు.

''థాంక్యూ మిస్టర్ గిరిధర్!'' మనసులోనే అనుకున్నాను. ఎందుకంటే అతను రెండు శుభవార్తలు చెప్పివెళ్ళాడు. స్వరూప పేరుతో వున్న ఆస్తిపాస్తులన్నీ నాకు సంక్రమించాయనే వార్త ఒకటి, స్వరూప మరణాన్ని యాక్సిడెంటుగా నిర్ధారించి పోలీసులు కేసు మూసి వేసారని మరొకటి! అప్పటి వరకు మనస్సులో దాచుకున్న ఆనందం ముఖంలోకి వచ్చి చేరింది ''ఈ ఆనందాన్ని వెంటనే వెళ్ళి సునందతో పంచుకోవాలి'' అనుకుంటూ సీట్లో నుంచి లేచి బయటికి నడిచాను. తలుపు దగ్గర ఆగి వెనక్కి తిరిగి స్వరూప ఫోటో వంక కసిగా చూసాను.

''చూసావా స్వరూపా! నువ్వు చేస్తే తప్ప నాకు ఆనందం మిగల్లేదు'' అనుకుంటూ బయటికి నడిచాను.

కారు దిగి యింట్లోకి నడుస్తుండగా పనిమనిషి రంగమ్మ ఎదురొచ్చింది.

'హైదరాబాదు నుండి వందనమ్మ గారు, మరొకాయన కలిసి వచ్చారండి. ఏదో పని మీద బైటికెళ్ళారు. ఇంకొ గంటలో వస్తామని చెప్పమన్నారు'' అన్నది.

నా భృకుటి ముడి పడింది. 'వందన ఎందుకొచ్చినట్టు? ఆమెతో పాటు వచ్చిన యింకో వ్యక్తి ఎవరు' అనుకుంటూ బెడ్‌రూంలోకి నడిచాను. వందన స్వరూప చెల్లెలు. హైదరాబాదు ఉస్మానియా యూనివర్శిటీలో రీసెర్చి స్కాలర్! స్వరూప చనిపోయినప్పుడు వచ్చింది అక్కంటే పంచప్రాణాలు వందనకు. ఆమె పోవటం వందనకు పెద్ద షాక్! చాలా బాధ పడింది. నాలుగు రోజులుండి వెళ్ళిపోయింది అప్పుడు ఆమె వెళ్ళేటప్పుడు నేను చెప్పిన మాటలు గుర్తొకొచ్చాయి నాకు.

''వందనా! మీ అక్కంటే నీకు ఎంత అనురాగమో నాకు తెలియని విషయం కాదు. ఆవిడ పోయినంత మాత్రాన యీ యింటితో నీకు సంబంధం తెగిపోయిందని ఎంత మాత్రం అనుకోవద్దు నీకు ఎలాంటి అవసరం వచ్చినా మీ బావ బ్రతికే వున్నాడన్న విషయం గుర్తుపెట్టుకో!'' గొంతులో దుఃఖాన్ని ధ్వనింప చేస్తూ, ముఖంలో ఆవేదనను ప్రతిఫలింప చేస్తూ పలికాను

బహుశా ఏదో పనిమీద యీ వూరొచ్చివుంటుంది. ఇక యీ రోజు సునంద యింటికి వెళ్ళటానికి కుదరదు వందనను యింట్లో పెట్టి తను రాత్రంతా సునంద యింట్లో గడిపితే ఆమె అపార్థం చేసుకునే ప్రమాదం వుంది ''అక్క చనిపోయి నెల రోజులయిందో లేదో బావ ఎక్కడెక్కడో తిరుగుతున్నాడని ఆమె అనుకోకూడదు ''

డ్రస్సు మార్చుకొని బెడ్‌పై వాలిపోయాను. పర్సులో నుండి సునంద ఫోటో తీసి పెదాలపై ఆనించుకున్నాను. అద్భుతమైన సౌందర్య రాశి సునంద. వెరీ స్మార్ట్ గర్ల్!

ఎవరు దెయ్యం?

తొమ్మిది కావస్తుండగా వచ్చింది వందన తనతో పాటు మరొక యువకుడు వున్నాడు.

''ఇతను ఫణికుమార్ అని మా కజిన్ బ్రదర్ బావా! భిలాయి స్టీల్ ఫ్యాక్టరిలో కెమికల్ యింజనీర్‌గా జాబ్ చేస్తున్నాడు. అక్క పోయిన విషయం తెలిసి వచ్చాడు'' అన్నది అతన్ని నాకు పరిచయం చేస్తూ ఆ యువకుడు నాకు తన సానుభూతిని తెలియ చేశాడు. ఆ తర్వాత అందరం కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు పూర్తి చేశాము వందన తన రీసెర్చి వర్క్‌లో భాగంగా ఎవరో ప్రొఫెసర్‌ని కలవాలని యీ వూరొచ్చినట్టు, రెండు మూడు రోజులలో తిరిగి వెళ్ళిపోతానని చెప్పింది వాళ్ళిద్దరికీ క్రింద గదుల్లో బస ఏర్పాటు చేయమని పని మనిషితో చెప్పి మేడ మెట్లు ఎక్కి మా బెడ్ రూంలోకి చేరుకున్నాను.

బెడ్ మీద పడుకొని టీపాయ్ మీదున్న ఫోటో ఫ్రేం చేతుల్లోకి తీసుకున్నాను నేను, స్వరూప కలిసి తీయించుకున్న ఫోటో వుంది అందులో ఎంతో అన్యోన్య దంపతులు అనిపించేలా వుంది ఆ ఫోటో! ఎప్పుడో పెళ్ళయిన కొత్తల్లో తీయించుకున్న ఫోటో అది! ఆ ఫోటోలోని స్వరూప రూపాన్ని తదేకంగా చూస్తూ వికృతంగా నవ్వుకున్నాను.

''ఇంకొద్ది రోజుల్లో నీ స్థానంలో సునంద వుంటుందిస్వరూపా! చచ్చిఏలోకంలో వున్నావో కాని నేను సునందను పెళ్ళి చేసుకోవటం చూసి మరీ ఏడుస్తావు. బ్రతికినంత కాలం నన్ను నరకయాతన పెట్టినందుకు నీకు నేను విధిస్తున్న శిక్ష యిది'' అనుకుంటూ ఫోటోను తీసి టీపాయ్ మీద పెట్టాను సునందను మనసులో నింపుకొని నిద్రకు వుపక్రమించాను

హఠాత్తుగా నిద్ర మెలకువ వచ్చింద. గది చీకటిగా వుంది. ఫ్యాన్ కూడా తిరగటంలేదు.

'కరెంటు పోయింది కాబోలు' అనుకుంటూ రిస్ట్ వాచీ చూశాను. రేడియం డయల్ పన్నెండు చూపించింది. అప్పుడు వినిపించింది నా చెవులకు సన్నని ఏడుపు. ఎవరో స్త్రీ వెక్కివెక్కి ఏడుస్తున్న శబ్దం. ఆశ్చర్యంతో లేచి నిలుచున్నాను. క్రమంగా ఆరోదన తీవ్రస్థాయికి చేరుకుంటున్నది. ఎవరు ఏడుస్తున్నది? వందనా? చనిపోయిన అక్క జ్ఞాపకాలతో విలపిస్తున్నదా? చెవులు రిక్కించి విన్నాను. ఆ ఏడుపు క్రింద నుంచి కాదు. ఇక్కడే - నా గదిలోనే ఏడుస్తున్న శబ్దం. కళ్ళు చిట్లించి చూశాను. ఏమీ కనిపించటంలేదు. గుండెల్లో సన్నగా భయం ప్రవేశించింది ఆ గొంతు అచ్చం స్వరూప గొంతులాగవుంది. భయంతో నా శరీరంలో వణుకు ప్రారంభమైంది అనుమానం నివృత్తి చేసుకుందామని తలుపు తీసి మెట్లు దిగటం ప్రారంభించాను. ఆశ్చర్యం! క్రింద హాల్లో లైటు వెలుగుతూనే వుంది. మరి నాగదిలో కరెంటు ఎందుకులేదు? ఆలోచిస్తూ క్రిందికి చేరుకొని కిటికీ గుండా వందన పడుకొని వున్న గదిలోకి తొంగి చూశాను బెడ్ మీద నిశ్చలంగా నిద్రిస్తున్నది వందన అయితే ఏడుస్తున్నది వందన కాదన్నమాట. పనిమనిషి రంగమ్మ వంటగది బయట చాపపై పడుకొని ఆదమరిచి నిద్రపోతున్నది ఇంట్లో వున్నది యిద్దరే ఆడవాళ్ళు. ఇద్దరూ నిద్రపోతున్నారు. మరి నేను విన్న ఆ ఏడుపు ఎవరిది? స్వరూపదా? ఛీఛీ! ఏమిటి తను యింత మూర్ఖంగా ఆలోచిస్తున్నాడు? చనిపోయిన స్వరూప ఏడుపు తనకు వినిపించటం ఏమిటి? ఏదో భ్రమలో తనకు అలా అనిపించి వుంటుంది అనుకుని తిరిగి మెట్లు ఎక్కి నా రూంకి చేరుకుంటూ వుండగా భళ్ళున ఏదో క్రింద పడినట్లు శబ్దం వినిపించింది ఆ శబ్దం నా రూంలో నుండి అనిపించటంతో హడావిడిగా రూంలోకి ప్రవేశించాను. రూమ్‌లో లైటు వెలుగుతూవుంది ఫ్యాన్ తిరుగుతూవుంది టీపాయ్ మీదున్న ఫోటో ఫ్రేంక్రింద పడి అద్దం బ్రద్దలయివుంది.

"ఎలా క్రింద పడింది యిది? బలమైన గాలి కూడా రావటం లేదు. అయితే ఏ పిల్లినో నెట్టివుండాలి" అనుకుంటూ బెడ్‌పై వాలిపోయాను. ఆ రాత్రి నాకు నిద్ర కరువైంది. మళ్ళీ ఆ ఏడుపు వినిపిస్తుందేమోనని చాలాసేపు ఆలకించాను కాని వినిపించలేదు

★ ★ ★ ★ ★ ★ ★

మరుసటి రోజు సాయంత్రం ఫ్యాక్టరీ నుండి నేరుగా సునంద యింటికి వెళ్ళాను రాత్రి పదింటివరకు ఆమెతో ఉల్లాసంగా గడిపాను మాటల సందర్భంలో రాత్రి జరిగిన అనుభవాలను ఆమెతో చెప్పి, "ఆ గొంతు అచ్చం స్వరూప గొంతులాగే వుంది. ఎంత వెదికినా ఎవరు ఏడిచిందీ తెలిసి రాలేదు. పైగా నేను రూంలో వుండగా కరెంటు లేకపోవడం, క్రింది నుంచి పైకి రాగానే గదిలో కరెంటు వుండటం, ఫోటో ఫ్రేం దానంతట అదే క్రిందపడి పగిలిపోవటం చాలా విచిత్రంగా

అనిపించింది. నిజం చెప్పాలంటే కొద్దిగా భయపడ్డాను కూడ" అన్నాను.

సునంద పకపకానవ్వింది.

"ఒకవేళ మీ ఆవిడ చచ్చి దెయ్యమై వచ్చిందేమో!" అన్నది ఆమె తమాషాకు ఆ మాట అన్నప్పటికీ నాకెందుకో ఆవూహ భయంకరంగా అనిపించింది. స్వరూప దయ్యమై నన్ను సాధించబోతున్నదా? తను బ్రతికినంత కాలం, నాకు సుఖం లేకుండా చేసింది. చచ్చికూడా నాకు సుఖం లేకుండా చేయబోతున్నదా?

"ఇంతకీ మన పెళ్ళెప్పుడు డియర్!" సునంద నన్ను గారంగా అల్లుకుపోతూ అడిగింది

"ఆ తొందరే వద్దన్నాను. పెళ్ళి కాలేదని తప్ప నీకు ఏం తక్కువ చెప్పు! అయినా భార్య పోయి నెల దాటిందో లేదో అప్పుడే పెళ్ళికి సిద్ధపడితే ఏం బావుంటుంది చెప్పు! కొంత కాలం గడవనీ!" అన్నాను

"మీ ఆవిడ దయ్యమై వచ్చి మన పెళ్ళి జరగకుండా చేస్తుందేమో! ఆవిడ బ్రతికుండగా మీరు నన్ను కలుసుకోవడానికి ఎన్ని యిబ్బందులు పడేవారో గుర్తుంది కదూ!" కవ్విస్తూ అన్నది సునంద. ఆ మాట నిజమే! స్వరూప బ్రతికుండగా నాపైన ఎంత నిఘా, ఎన్ని ఆంక్షలు! ఆస్తులు, బ్యాంకి అకౌంట్లు అన్నీ తన పేరు మీదుగా వుంచుకొని నన్ను ఎంతగా బాధించింది! సుఖాలకు, జల్సాలకు అలవాటు పడిన నన్ను ఎన్ని కట్టుదిట్టాలలో పెట్టాలని ప్రయత్నించిందో! ముఖ్యంగా నేను సునందతో కలిసి తిరుగుతున్నానని గ్రహించి నప్పటి నుండీ పగబట్టిన పాము అయింది

ఎలాగైతేనేం స్వరూప పీడ విరగడయి పోయింది

సునంద దగ్గర శలవు తీసుకొని కారెక్కి యింటికి బయలు దేరాను. సన్నగా వర్షం చినుకులు పడుతున్నాయి రోడ్డు మసక మసకగా వుంది వైపరు వేశాను పనిచేయటం లేదు. ఆశ్చర్య పడ్డాను ఇందాక వచ్చేటప్పుడు పనిచేస్తున్న వైపర్లు యిప్పుడు ఎందుకు పనిచేయలేదో అర్థం కాలేదు సునంద అన్నట్లు స్వరూప ఆత్మ నన్ను వెంటాడుతున్నదా? అన్ని విధాలుగా నన్ను యిబ్బంది పెట్టాలని, బాధించాలని ప్రయత్నిస్తూ వున్నదా?

ఇంటికి చేరాను పనిమనిషి రంగమ్మ తలుపు తీసింది

"వందన, ఫణికుమార్ మేలుకొని వున్నారా? అడిగాను. వాళ్ళు మేలుకొని వుంటే యింత రాత్రి వరకు నేను బయట తిరిగి రావడం చూస్తే బావుండదనిపించి అడిగాను

"ఇప్పటి వరకు మీ కోసం చూసి యిప్పుడే నిద్రపోయారు బాబూ!" చెప్పింది రంగమ్మ 'థాంక్ గాడ్' అనుకున్నాను.

భోజనం అక్కర్లేదని రంగమ్మతో చెప్పి మేడ మెట్లెక్కి నా బెడ్‌రూంకి చేరుకున్నాను. డ్రస్సు మార్చుకొని లైటు ఆర్పి బెడ్ లైటు వెలిగించి పరుపుపై వాలిపోయాను. బాగా అలిసి పోయి వుండటంచేత వెంటనే నిద్ర పట్టింది!

"ఏమండీ!"

చెవి దగ్గర ఎవరో మెల్లగా పిలుస్తున్నట్లు అనిపించి గబుక్కున నిద్ర మేల్కొన్నాను సందేహం లేదు అది స్వరూప స్వరమే! భయంతో వళ్ళంతా చెమటలు పట్టాయి. గదంతా చీకటిగా వుంది. మళ్ళీ కరెంటు పోయిందా! లేచి కూర్చున్నాను మంచం మీద ఒక్క సారిగా గుండె ఝల్లు మంది. కిటికీ అవతల నుండి ఒక స్త్రీ మూర్తి లీలగా అదృశ్యమై పోతున్నది తెల్ల చీరలో వుంది ముఖం సరిగ్గా కనిపించటం లేదు వెనుక నుంచి అచ్చం స్వరూపలాగే వుంది అదే ఎత్తు, అదేలావు

ఆ వైపుకు చూడాలంటేనే భయం వేసింది దుప్పటి లాక్కొని నిండుగా కప్పుకొని పడుకున్నాను గుండెల్లో వణుకు ప్రారంభమైంది సందేహం లేదు! స్వరూప దయ్యమై నన్ను పీడిస్తున్నది నేను సుఖపడకుండా అడ్డు పడుతున్నది నాకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నది ఈ సంగతి వందనకు చెపితే! నవ్వుతుందేమో! 'అక్క పోయిన బాధతో, ఆమె తలపులతో వుండబట్టి మీకు అలా అనిపిస్తున్నది బావా!" అంటుందేమో!

ఆలోచనల్లో వుండగానే మళ్ళీ వినిపించింది సన్నని ఏడుపు! వెక్కి వెక్కి ఏడుస్తున్న స్వరూప గొంతు

'ఏమండీ!" ఆ ఏడుపులో నుండి మెల్లగా నన్ను పిలుస్తున్న స్వరూప గొంతు భయంతో గుండె దడదడలాడింది కళ్ళు తెరిచి చూడటానికి ధైర్యం చాలటంలేదు

గదిలో ఎవరో అటూ యిటూ నడుస్తున్న అడుగుల చప్పుడు నాగుండె దడను రెట్టింపు చేస్తున్నది

"ఎవరు? ఎవరది? బిగ్గరగా అరిచానని అను కున్నాను కాని నా గొంతు నాకే వినిపించ నంత తగ్గు స్థాయిలో వుంది



నవ్వు! తెరలు తెరలుగా నవ్వు!

"ఏమండీ! అప్పుడే నన్ను మర్చిపోయారా? నేనండీ! మీ స్వరూపని "

ఆ మాటలు వినగానే భయంతో నాకు నాలుక ఎండి పోయింది నోట్లో నుంచి మాట రాలేదు ఎంత ప్రయత్నించినా. సందేహం లేదు ఇది స్వరూప గొంతు! కాని ఎందుకో ఆ నిజాన్ని అంత త్వరగా నమ్మలేక పోతున్నాను చనిపోయిన స్వరూప దయ్యమై మళ్ళీ నా గదిలోకి రావడం ఏమిటి!

ఎందుకొచ్చావు? హీన స్వరంతో ప్రశ్నించాను

'నేను పోయాక మీరెలా వున్నారో చూద్దామని వచ్చానండి? ఎంతైనా మీరు నా భర్త గదా!" బదులిచ్చింది నేనేమీ మాట్లాడలేక పోతున్నాను నాకు గుండెలు జారిపోతున్నాయి

అడుగుల శబ్దం దూరం అవుతున్న చప్పుడు. మెల్లగా దుప్పటి తొలగించి కళ్ళు విప్పి చూశాను కిటికీకి అవతల వైపు సన్నని పొగ క్రమంగా కరిగి పోతున్నది లేచి వెళ్ళి స్విచ్ దగ్గరకు నడిచాను. ఎవరో మంత్రించినట్లు గదిలో లైట్లు వెలిగాయి ఫ్యాను తిరగడం ప్రారంభించింది భయంతో, ఆశ్చర్యంతో బిగ్ర బిగుసుకు పోయాను. సరిగ్గా అప్పుడే గోడగడియారం మూడు కొట్టింది

* * * * * * *

"సునందా! నాకెందుకో భయంగావుంది. స్వరూప దయ్యమై రావటం కళ్ళారా చూశాను. నాకు మనశ్శాంతి లేకుండా పోతున్నది" దిగులుగా అన్నాను రెండు రోజుల్లోనే ఎంతో నీరసపడి పోయాను మానసికంగా బాగా క్రుంగి పోయాను. పరిస్థితులు ఎలా దారి తీస్తాయో ననే భయం క్షణక్షణం నన్ను క్రుంగదీస్తున్నది

ఇదివరకటి లాగ సునంద నా మాటలను తమాషాగా తీసుకోలేదు ఆమెకూడా ఆలోచనల్లో పడింది రెండు రోజుల్లో శారీరకంగా, మానసికంగా నాలో వచ్చిన మార్పులు ఆమెని కూడా ఆందోళనకు

గురి చేయసాగాయి.

"పోనీ యీ రాత్రికి నేను కూడా మీ గదిలో మీతో పాటు పడుకుంటాను" అన్నది సునంద అయితే ఆ సలహా నాకు నచ్చలేదు. ఇంట్లో వందన, ఆమె కజిన్ బ్రదర్ వుండగా నేను మరొక స్త్రీతో కలిసి వెళితే నన్నెంత నీచంగా తలపోస్తారు? నా భయం యింకొకటి కూడా! నేను, సునంద ఆ బెడ్ రూంలో పడుకొని వుండగా స్వరూప మళ్ళీ దయ్యమై వచ్చి ఎంత గలభా చేస్తుందో అనే ఆలోచన కూడా లేకపోలేదు

"చూద్దాం! నాది కేవలం భ్రమేనేమో! తొందరపడి నలుగురిలో అభాసుపాలు కావడం ఎందుకు? రెండు రోజులు ఆగి ఏదో ఒక నిర్ణయం తీసుకుందాం" అని ఆమెకు చెప్పి యింటికి చేరుకున్నాను డ్రాయింగ్ రూంలో కూర్చొని చెస్ ఆడుతున్నారు వందన, ఆమె కజిన్‌బ్రదర్ ఫణికుమార్!

"రండి బావా! మీరూ కూర్చోండి" నన్ను చూస్తూనే ఆహ్వానించింది వందన.

"నేను బాగా అలిసిపోయి వున్నాను. మీరు ఆడండి. నేను వెళ్ళి రెస్టు తీసుకుంటాను" అని చెప్పి పైగదిలోకి చేరుకున్నాను.

ఆ రాత్రి ఏమైనా సరే నిద్రపోకూడదని, యీ దయ్యం సంగతి ఏమిటో తేల్చుకుందామని అనుకున్నాను. ఫ్రిజ్‌లో నుండి బాటిల్స్ తీసి టీపాయి మీద పెట్టుకొని కూర్చున్నాను. కాలం కరిగి పోతూవుంది. సీసాలు ఖాళీ అవుతున్నాయి. గోడ గడియారం ఒకటి కొట్టింది. తలెత్తి ఆగడియారం వంక చూశాను. పదకొండున్నర అయింది. చాలా పాతకాలం నాటి గడియారం అది. స్వరూపకు ఎంతో యిష్టం! కోరి తన గదిలో పెట్టించుకుంది. కొత్త ఎలక్ట్రానిక్ వాల్‌క్లాక్ కొందామని తను ఎన్ని సార్లు చెప్పినా ఆ గడియారం మార్పించటానికి ఒప్పుకోలేదు. రేపో ఎల్లుండో యీ గోడగడియారాన్ని మార్చాలి' అనుకుంటూ గ్లాసు అందుకున్నాను అర్ధగంట గడిచింది. గడియారం గంటలు కొట్టడం ప్రారంభించింది. శ్రద్ధగా లెక్కించ సాగాను. ఒకటి.... రెండు.... పది.. పన్నెండు.. పదమూడు!

పదమూడు గంటలు!

నిజంగానే గడియారం పదమూడు గంటలు కొట్టింది.

స్వరూపకి ఎంతో యిష్టమైన యీ గడియారాన్ని

ఎవరు దెయ్యం?

మార్చి వెయ్యాలని తను అరగంట క్రితమే అనుకున్నాడు. ఇంతలోనే తన అయిష్టత తెలియచేస్తూ స్వరూప గడియారం చేత పదమూడు గంటలు కొట్టించిందా? దయ్యం పని. కాకపోతే గడియారం పదమూడు గంటలు కొట్టడం ఏమిటి? నాలో భయం క్రమ క్రమంగా చోటు చేసుకోసాగింది. దానితో పాటు అసహనం, కోపం కూడా చేరాయి

చచ్చి కూడా తనను సాధిస్తున్నది స్వరూప. అనుక్షణం తనకి మనశ్శాంతిని కరువు చేస్తూ పిచ్చివాడిని చేస్తున్నది. కోపంతో గుండె భగభగ మండసాగింది నాకు.

సరిగ్గా ఆ క్షణంలో వినిపించింది స్వరూప గొంతు

"ఏమండీ! నా పీడ విరగడైందని ఎంతో సంతోషిస్తూ వున్న మీకు యిలా దయ్యమై వచ్చి బాధ కలిగిస్తున్నాను కదూ!" మెల్లగా మంద స్వరాన వినిపించింది. నాలో ఆవేశం, కసి, ఉద్రేకం!

"చచ్చినదానివి మళ్ళీ నా వెంట ఎందుకు పడ్డావు?" ఆవేశంగా ప్రశ్నించాను

"నేను చచ్చిపోలేదండీ! మీరే నన్ను చంపారు. బాగా గుర్తు తెచ్చుకోండి. ఆ రోజు కారు బ్రేకులు చెడగొట్టి చాలా చాకచక్యంగా నా చావుకి కారణం అయ్యారు."

గుండె ఝల్లుమంది! నా గుండెల్లో దాచుకున్న నిజం బయటికి రావటంతో ఉలిక్కిపడ్డాను. స్వరూపను నేనే చంపానన్న నిజం లోకానికి తెలీదు అని సంతోషించాను కాని దయ్యాలకు నిజం తెలీకుండా వుంటుందా?

"ఏమండీ మాట్లాడరు? నన్ను చంపింది మీరు కదూ?" రెట్టించింది ఆ స్వరం భయము, ఆవేశము, కోపం, త్రాగిన మైకం అన్నీ నాలో విపరీతమైన సంచలనాన్ని సృష్టిస్తున్నాయి

"యస్! నేనే చంపాను నీ కారు బ్రేకులు తొలగించి నీ అడ్డు తొలగించుకున్నాను లక్షల ఆస్తి కలిగిన స్త్రీకి భర్తనయి కూడా చేతిలో చిల్లిగవ్వ లేక అవస్త పడే స్థితికి తీసుకొచ్చావు. నీతో సంసారం యిష్టంలేక సునందతో ప్రేమాయణం సాగించాను. నీ అడ్డు శాశ్వతంగా తొలగించుకుంటే ఆస్తిని యధేచ్ఛగా అనుభవించవచ్చనీ, సునందతో సుఖంగా గడపవచ్చునీ నేనే నిన్ను హత్య చేశాను. యస్, ఐ డిడ్ యిట్!" బిగ్గరగా అరిచాను

ఒక్కసారిగా గదిలో లైట్లు వెలిగాయి. నా చుట్టూ వందన, ఫణికుమార్, యిద్దరు పోలీస్ యిన్స్పెక్టర్లు నిలుచుని వున్నారు.

"మిస్ వందనా! మీ సందేహం నిజమైంది మీ అక్కయ్యను హత్య చేసిన మీ బావగారిని అరెస్టు చేస్తున్నాను" అంటూ ఒక యస్. ఐ. బేడీలతో నా దగ్గరకు వస్తున్నాడు.

"ఏమిటిది?" బిగ్గరగా అడిగాను. ఫణికుమార్ గది మూలలో చెత్త బుట్టలో పెట్టిన టేప్ రికార్డును, బీరువా పైన వుంచిన స్పీకర్లను తీస్తున్నాడు. నాకు బుర్ర తిరిగి పోతున్నది.

"ఐ యాం సారీ బావా! అక్కయ్యను హత్య చేసింది నువ్వేనని నా అనుమానం అక్కయ్య చనిపోయే నెలరోజుల ముందు తన భయాన్ని వ్యక్తం చేస్తూ నాకు లెటర్ వ్రాసింది. అయితే నువ్వు చాలా పకడ్బందీగా, ఎవ్వరికీ అనుమానం కలిగించని రీతిలో ఆమెను అడ్డు తొలగించావు. నేను హైదరాబాదులో ప్రైవేటు డిటెక్టివ్ ఫణికుమార్ గారితో సంప్రదించాను. మా కజిన్ బ్రదర్‌గా ఆయన్ని యిక్కడికి తీసుకొచ్చాను. ఆయన మెజీషియన్, పైగా మిమిక్రీ ఆర్టిస్టు కూడ. ఆయన సహకారంతో పథకం వేసి నిజాన్ని నీ నోటి ద్వారానే చెప్పించి రికార్డు చేశాము" చెప్పింది వందన.

ఫణికుమార్ గొంతు విప్పాడు.

"చట్టానికి భయపడని వ్యక్తి కూడ అంతరాత్మకు భయపడతాడు. అందుకే మీ మనసులో భయం క్రియేట్ చేయడానికి దయ్యం పేరుతో యింత కథ నడపవలసి వచ్చింది. మీరు విన్న స్వరూపగారి గొంతు నాదే! స్పీకర్ల ద్వారా శబ్దాలు, ఏడుపులు మీకు వినిపించేలా చేశాము. కిటికీ బయట భాస్వరం మండించి పొగ సృష్టించాము. కరెంటు పోవడం, రావడం యివన్నీ చాలా చిన్న ట్రిక్కులు" నవ్వుతూ అన్నాడు. "అలాగే ఫోటో ఫ్రేం క్రింద పడెయ్యడం."

"మరి గడియారం పదమూడు గంటలు కొట్టడం, కారు వైపర్లు పని చేయకపోవడం...?" అడిగాను.

"మీరు సునంద యింట్లోకి వెళ్ళినప్పుడు నేను మిమ్మల్ని ఫాలో అయి అక్కడ వైపర్లు కనెక్షన్లు తీసివేశాను. గడియారం పళ్ళ చక్రానికి మధ్య యింకొక సందు ఏర్పరిస్తే పదమూడో గంట కొడుతుంది. మనిషి తప్పు చేశాననే ఫీలింగ్‌తో వున్నప్పుడు ప్రతిచిన్న విషయానికి భయపడతాడు. ఆ సైకాలజీ ఆధారంగా మిమ్మల్ని ఆడించాము. దయ్యాలు వున్నాయనేది కేవలం భ్రమ! మానవత్వం మరిచి డబ్బు కోసం అమానుషంగా ప్రవర్తించే మనుషులే దయ్యాలు." అంటున్న ఫణికుమార్ మాటలు నా మనస్సును సూటిగా తాకాయి సిగ్గుతో తలవంచుకున్నాను ఇన్స్పెక్టరు నా చేతికి సంకెళ్ళు తగిలించాడు ●

తెలుగు-తెగులు

అమ్మాయిల కోసం
వెతుకుతున్నారు స్టూడెంట్స్
సందులు!
మర్చిపోయారు
తెలుగు మాస్టారు చెప్పిన
సంధులు!

వారి ఆనందాన్ని
మరింత పెంచుతున్నాయ్
సోమాసాలు!
గుర్తుంటం లేదు
పంతులుగారు వ్రాసిన
సమాసాలు!

-కె.సి.బాబు,జె.వి.బాబు